
# సీతా! వర్ధిల్లు

## దేవిరెడ్డి వెంకటరెడ్డి



"ఈ దేశం బాగుపడదు పెద్దమ్మా!''

ఖాళీసీసాలను శుభ్రపరుస్తున్న శకుంతల గుండెల్లోంచి సాదాసీదా వచనం పుట్టింది.

పెళ్లికి ముందునుంచి ఆమె భర్త బేల్దారి పనిచేసేవాడు. పోయినేడు మూడంతస్తుల మేడ మీదినుంచి కాలుజారి బలైపోయాడు. క్రమక్రమంగా మొగుని విచారం తగ్గుముఖం పడుతోంది గాని నెలల తరబడి 'బాటిల్ క్లీనింగ్ సెంటర్' వాతావరణం చూస్తుంటే మగవాళ్ల పట్ల ఒక అపనమ్మకం బలపడుతోంది.

రోజూ ఖాళీసీసాల మూటలు వందలకొద్ది దిగుమతవుతున్నాయి. మరుదినం రాత్రికి శుద్ధి చేసిన సీసాల్ని కడుపారా నింపుకుని హైదరాబాదుకు లారీ తరలిపోతుంది. ఒక పగేలు, రాత్రికి దేశంలోని సామాన్యులు, మేధావులు లక్షలాది కేసుల బాటిళ్లను ఖాళీచేస్తున్నారు. ఇంత తాగుడా! బాగుపరచాల్సిన వాళ్లు బానిసలైపోతున్నారు. ఎవరి పాట్లు వాళ్లవే అనుకుంది.

''ఎక్కడో విన్నట్లుంది సినిమా డైలాగా?''

క్వార్టర్ బాటిల్ క్లీన్ చేస్తూ సరస్వతమ్మ నగుమొగంతో తమాషాడింది. ఈ నిర్భాగ్యమాటితో ఎందుకు నోరు చేసుకుంటినా అని ఎప్పుడూ అనుకోదు. పక్కపక్క ఇళ్లు కావడంతో చెనకడం ఆమెకదో వాత్సల్యం.

''ఏం సరూ! మరీ తీసిపారేస్తున్నావు. మన బతుకుల్లోంచి సినిమా డైలాగులొస్తాయా?'' ఆఫ్ బాటిల్ లేబులు తీస్తూ పదేళ్ల సావాసమూ, అంతా మగదిక్కులేని ఆడవాళ్లమనే సానుభూతీ వున్నా సీరియస్ అయింది గంగమ్మ. దూబగుంట స్త్రీల ఉద్యమం మళ్లీ దేశమంతా రగిలి మంటలెగజిమ్మితే చూడాలనిపించింది. స్కూటరు శబ్దం విని ఆఫీసు గది వైపు తల తిప్పింది.

'సాయినగర్' మధ్యలో పన్నెండు సెంట్ల ఇనప రేకుల షెడ్డు. అందులో ఖాళీ సీసాలను ఐదురాశులుగా కుమ్మరించారు. రాశికిద్దరు ఆడవాళ్ల చొప్పున మూతలు రింగులు తీస్తున్నారు. మగ మనిషి వాటిని సిమెంటు తొట్లల్లో నానబెడుతున్నాడు. ఐదొందలు వెయ్యి పట్టే తొట్లు ఆరేసి వున్నాయి. ఇరవై మంది ఆడవాళ్లు సబ్బు, బ్రెష్షు, సోపాయిలు పక్కనుంచుకుని సీసాలను శుభ్రపరుస్తున్నారు. ఎప్పటికప్పుడు ముగ్గురు మగవాళ్లు క్వార్టర్ బాటిళ్లను, ఆఫ్ బాటిళ్లను వేరుచేసి అట్టపెట్టెలకు పేర్చి ప్యాకింగు చేస్తున్నారు. రాత్రీ మధ్యాహ్నం సీసాలను నానబెడతారు గనుక పనికుంటుపడదు. ఓనరు గంట ఆలస్యంగా వచ్చినా ఎవరూ పనిదొంగలు కారు.

''సూపర్ బజార్లో రేపటినుంచి గోధుమలిస్తారట. ఓ యాభయ్ వుంటే ఇవ్వవా గంగమ్మక్కా?'' తాగుబోతుల గురించి ఆలోచించడం దండగని నేరుగా తన అవసరంలోకొచ్చింది సరస్వతమ్మ. ఈ దఫా ఐదు కేజీలు ఎక్కువ తెచ్చుకోవాలనుకుంది. ఏ కూతురైనా రావచ్చు. ముప్పూటలా బియ్యం కూడుకంటే రాత్రిపూట రోజూ చపాతీ తింటే తిండిలో మార్పూ వుంటుంది. ఒళ్లు కాస్త తగ్గి శక్తీ పట్టచ్చు. కేజీ ఏడురూపాయలంటే తనలాంటోళ్లకు కొంత వూరటే గదా!

''ఇస్తాను గాని మీ బజార్లో నాకో బాడుగిల్లు చూడవా? ఇప్పుడుండే కొంపకి వచ్చే నెలనుంచి ముప్పయ్ పెంచారు. ముండమోపుల కాడ కూడా డబ్బు దాహమా?'' గంగమ్మకు ఇంటి ఓనరు మీద విపరీతమైన కోపమేసింది. కూలి డబ్బుల్లో పాతికభాగం బాడుక్కే పోతే ఇంకేం పాముకోవాలి. దండిలాభముంది గనుక తప్పనిసరిగా కూలి పెంచాలనే శకుంతల వాదన నూటికి నూరుపాళ్లు సబబే.

''మా ఇళ్లకెదురుగా ఓ పెంకుటిల్లు ఖాళీ అయింది మాట్లాడమంటావా?''

ఒకరికి ఇద్దరు తోడయితే మరింత బలమనుకుంది సరస్వతమ్మ. ఆదిలోనే శుభంపలికినందుకు పది అటో ఇటో ఖాయం చేయమంది గంగమ్మ. ఈవారంలో మారచ్చు. సరిగ్గా నెలాఖరవుతుంది.

''సాయంత్రం నాలుగు చీరలు తీసుకుంటా పెద్దమా'' నిన్నటి మాదిరి ఎక్కడ మరచిపోతానో అని శకుంతలముందే గంగమ్మ చెవిలో వేసింది. అప్పంటే రేటెక్కువే ఏం చేస్తాం? గట్టి చీర ఒకటే వుంది. చేతిలో నగదు లేకపాయె. పెద్దమ్మ ఖాతాలో తీసుకుంటే నెలకింత తీర్చుకోవచ్చు. సరస్వతత్తకు, చలమయ్యకు తమ నిరసన కార్యక్రమాన్ని మతికి చేసి మళ్లీ గేటువైపు చూసింది సురేంద్ర ఎప్పుడెప్పుడు వచ్చునా అని. సియ్యాల కాడ కావలి కూర్చున్నట్లు కూర్చుండే మనిషి ఇంకా ఎందుకు రాలే దబ్బా అనుకుంది.

''ఏం నాదమునీ! మనమంతా ఒకమాటమీదుండాలి'' అమెరికా మీదికి యుద్ధానికి పోతున్నట్ల హుషారు చేసింది సరస్వతమ్మ. సురేంద్ర కోరచూపులకు ఎక్కడ తొసుగుతారోనని ఆమె శంకించక పోలేదు. అయినా ఇదేం శకుంతల సొంత సమస్యా? కూలి పెంచాడా అది అందరికీ వర్తిస్తుంది. ఫలిస్తుందో లేదో మొదలుపెడుతోంది అభినందనీయురాలు. సరేనమ్మా అను పొట్టిసమాధానం నాదముని పెదవులు దాటిన మరునిముషంలో సురేంద్ర వచ్చి తిరుగుడు కుర్చీలో కూర్చున్నాడు. ఉన్నఫళంగా అన్ని పనులు ఆగిపోయాయి. అంతా తిన్నగా వెళ్లి మూడు వరుసల్లో బైఠాయించారు.

''గంగమ్మా! ఏమిటి సంగతి?'' నొసలు పైకెగరేసి వింతగా చూశాడు సురేంద్ర. తగు మాత్రం కూడా ఆవేశంలేని మొగాలను చూస్తుంటే ఇది శకుంతల నిర్వాకమే అనిపించింది. నిన్నా మొన్నా ఒకటే గుసగుసలు. గుంపుకట్టి నాయకురాలు కావాలనుకుంటున్నదేమో! వయసుకు తగిన ఆలోచనా వుండచ్చు.

ఒక్కొక్కరు లేచి కూడేం... గుడ్డేం... పాలూ పెరుగేం... సబ్బులేం... నూనెలేం... కట్టెలేం... చెప్పలేం.. కరెంటేం..రోగాలేం.. రెండు వారాలకోసారైనా నెత్తరా పొట్టా తెచ్చుకోవాలా వద్దా.. అందరితో ఆటు మేమూ పండగా పారణా చేసుకోవాలా లేదా.. పది రోజులకోసారైనా కాయో పండో తినాలో వద్దా... ఇవన్నీ ఒక ఎత్తయితే ఇంటి బాడుగ మరో ఎత్తు. ఈ కూలితో మాబతుకులు మరీ భారమవుతున్నాయి. తలా ఐదారురూపాయల వంతున కూలి పెంచండి. అట్లా కాదంటే పనిలోకి వంగం. ఆడా మగా శ్రుతి మెత్తగా గొంతులు కలిపి కూర్చున్నారు.

సురేంద్రకు కోపం నన్నెత్తికెక్కింది గానీ తన్ను తాను సంభాళించుకున్నాడు. ఇన్నేళ్లుగా ఒక్కరు.... ఏ ఒక్కరు కూలి ప్రస్తావన తెచ్చిన పాపాన పోలేదు. చెప్పిన పని శ్రద్ధగా చేస్తున్నారు. ఇచ్చింది కళ్లకద్దుకుని పోతున్నారు. అట్లాంటిది ఇప్పుడు బెడిసికొడుతోంది. ఏమైనా రచ్చ చేసుకోవడం అవివేకం. దీనకంతకూ మూలకారకురాలు శకుంతలే. చాలామదికి తెలియని వ్యాపారమిది. పనిలోకి చదువు రాని వాళ్లే బెటరు. బీదరాలు, ఈ మధ్యనే భర్తపోయాడు. కష్టాల్లో ఉందని గంగమ్మ బతిమాలితే వినుకోక తప్పలేదు. టెన్తుక్లాసు ఫెయిలైన జ్ఞానం ఏమి జ్ఞానం లే అని చులకనగా తీసుకుంటే ఇప్పుడు ఏకు మేకవుతోంది. ఏకదమ్మున ఐదు రూపాయలు పెంచాలట. నెలా రెన్నెల్లు సెద్దుమూసేస్తే తనేం రోడ్డున పడతాడా? అష్టకష్టాల పాలయ్యేది వాళ్లే. మరి వాళ్లకుండాలి ఆ తెలివి.

''ఈ పద్ధతి ప్రకారం ఒక్క రూపాయపెంచను నేరుగా ఇంటికి వెళ్లండి. ఇదేం నట్టుదొగేపనా?'' తెచ్చిపెట్టుకున్న శాంతంతో సురేంద్ర మాటలకు తగినట్లు చేతులాడించాడు. ఆర్థికశాస్త్రాన్ని, సామాజిక శాస్త్రాన్ని అతడు చదువుకునే రోజుల్లో ఆపోశన పట్టలేదు గానీ తర్వాత కల్గిన జీవితానుభవం రెండింటిని నూరిపోసింది. విధిలేని పరిస్థితుల్లో సొంత లాభం కొంత తగ్గినా శోకాలు పెట్టేరకం కాదు. మళ్లీ పుంజుకునే ప్రయత్నం చేస్తాడు. అతనికి చౌకైన కార్మికులు కావాలి. అదేం తివిరి యిసుమున తైలం తీసేంత కష్టమైన పనీకాదు. కొడుకులు తల్లిదండ్రులమీద కరుణను జీవనదుల్లా ప్రవహింప చేసేది కల్ల. పేదరికం వున్నన్నాళ్లు కార్మికుల ఉత్పత్తి జరుగుతూనే వుంటుంది. వితంతువులు సరేసరి.

''మీ దృష్టిలో మేమేం ముష్టివాళ్లమా?'' శకుంతల వడిసెల రాయి విసిరింది. సురేంద్రకు చీమకుట్టినట్లు కూడా లేదు. మన్మధబాణంలా సోకింది. కేవలం ప్రాథమిక అవసరాలు తీర్చుకోడానికి తాముపడే అవస్థల్ని నాదముని వివరించాడు. నియంతలా కఠినంగా మాట్లాడడం భావ్యంకాదని సరస్వతమ్మ తన సహజధోరణిలో మెత్తగా మందలించింది.

''వ్యాపారంలోని సాదకబాధకాలు మీకేం తెలుస్తాయి సరస్వతమ్మా? సబ్బులు, బ్రస్సులు, అట్టపెట్టెలు హమాలీలు..కూళ్లు.. ఇవిగాక సేల్ టాక్సు, ఇన్‌కంటాక్సు, ట్రాన్సుపోర్టు బాడుగలకు బి.పి.పెరుగుతోంది. ఇక మిగిలేదేంది? నా పిండాకూడు''

''వ్యాపారంలోని సాదకబాధకాలు మీకేం తెలుస్తాయి సరస్వతమ్మా? సబ్బులు, బ్రస్సులు, అట్టపెట్టెలు హమాలీలు..కూళ్లు.. ఇవిగాక సేల్ టాక్సు, ఇన్‌కంటాక్సు, ట్రాన్సుపోర్టు బాడుగలకు బి.పి.పెరుగుతోంది. ఇక మిగిలేదేంది? నా పిండాకూడు'' కర్మకాండలోకి దిగి కిందున్న స్త్రీమూర్తులను సగం చల్లపరచాడు.

''దేనికైనా మధ్యస్తమార్గం వుంటుంది కదా బాబూ!'' గట్టిపిండంరా అనుకుంటూ గంగమ్మ మళ్లీ కదిలించింది. ఎవరైనా అడిగినంత ఇవ్వరు. అసలు గతంలో అంతా ఏకమై కూలిపెంచమని అడిగిన పద్ధతే లేదు. నిజానికిది శకుంతల పుట్టించిన చలనమే. ఎప్పుడో రెండు సార్లు అతడే తనంతకు తాను రూపాయ వంతున తిరిపెమిచ్చినట్లు పెంచాడు.

''గంగమ్మా! నీమాట నేనెప్పుడైనా కాదన్నానా? మీకు చేరేటప్పుడు అపాయింటుమెంటు ఆర్డర్లివ్వలేదే. ఈ సెంటరు పెట్టిందే మీకోసం. మీ సమస్యను గురించి నిదానంగా ఆలోచించి పెంచుతాను. ఉన్నఫలంగా తెగాలంటారా అదికానిపని.'' తగినంత లౌక్యం ప్రదర్శించి బింకంగా లేచాడు సురేంద్ర. కాలయాపన ఆయుధం ఎటూ చేతిలో వుంది. పైగా అల్ప సంతోషులు. గొరైల్లా పడుండే ముసిలీ ముతకల్ని తప్ప వేరే వాళ్లను చేర్చుకోకూడదనుకుంటూ వచ్చి ఆఫీసురూం నీడలో నిలబడ్డాడు.

ఎవరికీ తెల్లమొగాలు పడలేదు గానీ తర్జన భర్జనలు మొదలయ్యాయి. అతని పలుకుబడినీ, డబ్బుస్తోమతనీ అంచనాకట్టుకున్నారు. చేతి భత్యం తిని పదిరోజులపాటు నిలబడగల వాళ్లు తమలో ఒక్కరు లేరని తేలిపోయింది. విరోధం పెట్టుకుంటే వున్న సానుభూతి పోతుంది. తాడో పేడో తేల్చుకోకపోయినా బండి కదిలిందనే తృప్తితో శకుంతలను ఒప్పించి ఎవరి పనుల్లో వాళ్లు మునిగారు. అరగంటకు సురేంద్ర తిరిగొచ్చి యథాప్రకారం టేబులు మీద కాళ్లు పారచాచుకుని కూర్చున్నాడు. బయటకెక్కడా విజయగర్వం అగుపడలేదు.

శకుంతల మొగం దిగేసుకుని పనిచేస్తోంది. తోపుడు బండివాడు సీసా రూపాయకు కొంటున్నాడు. పాత ఇనపంగట్లో ఒకటీ ముప్పయ్ పైసలకమ్ముతున్నాడు. ఇనపంగళ్లవాళ్లు ఇక్కడ ఒకటిన్నర పైబడి వేస్తున్నారు. అంటే చెరో పావలా మించి లాభం. ఇది పబ్లిగ్గా తెలిసిన సత్యం. కనీసం అర్ధరూపాయలాభం లేందే ఈ మనిషి ఇంత పెద్దమొత్తంలో వ్యాపారం చేస్తాడా? బీరు బాటలు మీది లాభం ఈశ్వరుడే చెప్పాలి. ఇది ఇంటి గుట్టుకాదు గదా! ఒక్కొక్కరు ఎనిమిది వందలనుంచి వెయ్యి సీసాల వరకు శుభ్రపరుస్తున్నారు. కచ్చితమైన లెక్కలు ఏ యజమానీ చెప్పడు. దొంగరాతలతో, తేనె మాటలతో అందర్నీ మభ్యపెడుతాడు. తమ కోసమే క్లీనింగ్ సెంటర్ పెట్టాడట. ఏమి దయ? ఎంత ఔదార్యం! కొత్తవాళ్లకు ఇరవైరెండు ఏడాదికి రూపాయ ఇంక్రిమెంటు చొప్పున పాతవాళ్ల కూలి. మరి ఏమాత్రం పెంచి ఉద్ధరిస్తాడో చూడాలి అనుకుంది.

పది పన్నెండు మంది కూలీల అవసరాన్ని సరస్వతమ్మ, గంగమ్మ ముందుంచాడు సురేంద్ర. వాళ్లకు ప్రాధాన్యత యిచ్చినట్లూ వుంటుంది. సీసాల స్టాకును తగ్గించినట్లూ అవుతుంది. ప్రతి రోజూ ముగ్గురు దాకా పనిలోకి రావడంలేదు. వాళ్ల ఇబ్బందులేమైనా సకాలంలో రెండో లోడు పంపలేకపోవడం నిజం. తనకు తెలిసి ఇద్దరున్నారని నాదముని, ముగ్గురున్నారని సరస్వతమ్మ నమ్మకంగా చెప్పి వీలైతే రేపే పనిలోకి దింపుతామన్నారు.

''మిగతా వాళ్లను నేను చూస్తాను గానీ రేకుల పైన కాస్త బోధ కప్పించుబాబూ! ఎండలు మండిపోతున్నాయి. తట్టుకుండే వయసామాది.'' పాత విషయాన్ని తిరిగి గుర్తుచేసింది గంగమ్మ. గంటా రెండు గంటలంటే ఎట్లో గట్ల భరించచ్చు. సాయంత్రం ఐదున్నరవరకు అలవిగాని శాకం. ఈ సీమలో ఏడాదికి పదినెలలు ఎండాకాలమే. బెంగుళూరులో పుట్టినా బాగుండుననిపించింది.

''శకుంతలా! ఆఫీసురూంలో పేపరుంటుంది తెస్తురా'' గంగమ్మకు సంపూర్ణ అభయమిచ్చి చిరునగవుతో పిలిచాడు సురేంద్ర. బోదకోసం జేబు

లోంచి సెల్‌ఫోను బయటికొచ్చింది. శకుంతల అసహనంగా లేచి పేపరు తెచ్చిచ్చి తన స్టూలు మీద కూర్చుంది. పొద్దున పేపరు చదవలేదంటే ఎవరూ నమ్మరు. అంతో యింతో కొదవ వుండొచ్చు. పూర్తి చేయక పోతే సెడ్డుమీద బాంబులేస్తారా? పెళ్లాన్ని పిలిచినట్లు పిలిచాడు. ఇరవై రెండ్రూపాయల కూలికి అడ్డమైన సేవలు చేయాలి. రోజు రాగానే అందరం ఆఫీసు రూంతో సహా కసువు తోయడం, బయటనీళ్లు జల్లి ముగ్గువేయడం, మంచినీళ్ల బానలు కడిగి నీళ్లు నింపడం, శనివారం రాత్రికి సిమెంటు తొట్లు క్లీన్ చెయ్యడం మామూలైపోయింది. కాఫీ, టీ, పేపరు వగైరా చిల్లర పనులు బాబయ్యకు చెప్పేవాడు. సడన్‌గా ఎందుకు తప్పించాడో బోధపడడంలేదు. బహుశా తన్ను మంచి చేసుకోవడానికి కాబోలు.

''రాత్రికి నాలుగైదు ట్రాక్టర్ల బోద దిగుతుంది గంగమ్మా! తెల్లారి కప్పేపని మొదలుపెట్టిస్తా'' ఐదుగంటల ప్రాంతంలో సురేంద్ర ఉల్లాసంగా శుభవార్తను ప్రకటించి ''శకుంతలా! నువ్వో టీ తాగి నాకో టీ తెస్తురా'' అన్నాడు.

అదే పిలుపు. ఐదు రూపాయల బిళ్లను కుడిచేతిని తాకుతూ జారవిడిచాడు. శకుంతల ఎరుపెక్కిన కళ్లతో చరచరా వెళ్లింది. ఎండబాధ తప్పెలే అని అంతా సంతోషపడుతుంటే గంగమ్మకు మాత్రం ఒళ్లంతా కంపరమెత్తుకుంది. తలకాయలో అలజడి పుట్టింది. కళ్లారా చూసిన సన్నివేశంలో సురేంద్ర నడత బహుచిత్రంగా అగుపడింది. ఇంతవరకు ఆడవాళ్లకు కాఫీ, టీ తెమ్మని చెప్పిన సందర్భం ఒక్కటి లేదు. ఏ స్త్రీనీ కామ భావనతో చూసిందీ లేదు. పేరు పెట్టి పిలిచినా గౌరవం ఉట్టిపడేది. ఎందుకిలా మారుతున్నాడో! శకుంతల పొందికైన అవయవాలతో కొంత కంటికింపుగా వున్నమాట నిజం. వున్నంతమాత్రాన... బ్రహ్మకైనా బుట్టు రిమ్మ తెగులు అంటే ఇదేనేమో! ఇక్కడ చేర్పించినందుకు తనకు చెడ్డపేరు రాకూడదు. సెడ్డులో వున్నంత సేపు డేగకన్నేసి వుంచాలి. సురేంద్రబారినుంచి శకుంతలను కాపాడడం తన వంతని భీష్మించుకుంది.

నెల తిరిగీ తిరగక ముందే సాయంత్రం సెడ్డులోంచి బయటకపడ్డాక శకుంతల కళ్లనీళ్లు పెట్టుకుంది. గంగమ్మ శరీరం ఆపాద మస్తకం జలదరించింది. సరస్వతమ్మ మనసులో గుబులు చెలరేగింది. సురేంద్ర ఏం ఒత్తిడి చేశాడో! ఏదీ జరగంది ఆ కన్నీళ్లెందుకు?'

''ఎందుకే ఏడుస్తున్నావ్?'' గంగమ్మ ఆత్రంతో అడిగింది. సరస్వతమ్మ గుండెలుగ్గబెట్టుకుని మోర పైకెత్తి చూస్తోంది.

''రేపటి నుంచి మీకు దూరమవుతానా అనే సమస్య వచ్చిపడింది పెద్దమ్మా'' చెంపల మీదికి జారిన కన్నీటి బందువుల్ని పైట చెరుగుతో తుడుచుకుంటూ అంది శకుంతల.

''ఏం జరిగింది? సురేంద్ర ఏమన్నా అన్నాడా?'' క్షణాలమీద పసిగట్టింది గంగమ్మ.

''నిన్ను ఉంచుకుంటాను. నీ కిష్టమేనా? నువ్వేం అలనాటి సీతవా? అని అడగబట్టి ఇది మూడోరోజు. అతన్ని చూస్తుంటే గుండెదడ ఆగటం లేదు'' మురికిని భరించలేక శకుంతల కక్కేసింది. అతని అసభ్య శృంగారం మీద ఏదో మేరకు పోరాటం జరపచ్చు కానీ చివరకు అల్లరిపాలయ్యేది తనే. ఎందుకీపీడ అనుకుంది. నేదరపిల్లోల్లుండేపని. మచ్చపడకుండా బతకాలి.

గంగమ్మ, సరస్వతమ్మ కాళ్లు ఆగిపోయాయి. మగజాతి పట్ల పరమ అసహ్యమేసింది. ఎవడు మంచో... ఎవడు చెడో! జంతు లక్షణం ఎప్పుడు పోతుందో! ఏమి సంస్కారమో గాని ఆడది ఎర్రగా బుర్రగా వుంటే చాలు మగాడిలోని కీచకుడు బయటికొస్తాడు. ఉంచుకుంటాడట... ఉంచుకుంటాడు.



ఆడది అంత తేరగా వుందా? ఇంత నీచమైన కూతలా? గుండెకాయలుంటే పెళ్లి చేసుకుంటానని. అనుభవించిన కాడికి అనుభవించి పిప్పిని బయటపడెయ్యాలి. అదీ ఆ జాతి ధ్యేయం. గంగమ్మ నవనాడుల్లో నిద్రిస్తున్న పతివ్రతలు మేల్కొని శకుంతల అవతారమెత్తారు.

''శకుంతలా! నీకు వేరే పనిచూపిస్తా నిశ్చితంగా వుండు. నీమీద ఈగవాలితే నామీదొట్టు'' సురేంద్ర విసిరిన వలలో తటాలున పడనందుకు సంతోషిస్తూ భుజం తట్టి రెట్ట బట్టుకుని కదిలింది గంగమ్మ. ఈ పనేనా గురి? ఇటుకలు తయారుచేసే పనుంది. బిందెల ఫ్యాక్టరీ, కందిబేళ్ల ఫ్యాక్టరీ, చనక్కాయల పప్పు మిషనూ, సంచుల ఫ్యాక్టరీ ఒకటేమిటి? సవాలక్ష పనులున్నాయి. కాయకష్టం పెట్టుబడిగా వున్నంతకాలం పనులకేం కొదవ?

''ఇదీ ఒకందుకు మంచిదేలే. చెప్పాల్సిన విషయాలెప్పుడూ దాచకు. పగలు ఎడమైనా సాయంత్రంనుంచి కలిసే వుంటాం గదా. నీకే చెడూ జరగనివ్వం.'' సరస్వతమ్మ శకుంతల వీపు నిమురుతూ నడుస్తోంది. అత్యవసరమైతే వస్తాదుల్లాంటి తన అన్నకొడుకుల అండ వుండనే వుంది. ఈ పనిగాక పోతే ఇంకో పనవుతుంది. ఏం బతకలేదా? అనుకుంది.

శకుంతలకు రాత్రి పొద్దుపోయేవరకు నిద్ర పట్టింది గాదు. భర్త కాలమైనప్పటినుండి ఎదురుపడిన సంఘటనలను ఒక్కొక్కటే నెమరేసుకుని గుండె దిటవుచేసుకుంది. నిద్రపోతున్న పిల్లలను మరీ మరీ చూసుకుంది. వీళ్లు పెద్దయ్యేంతవరకు తన చేతులు కాళ్లు బాగుండాలని కోరుకుంది. సరస్వతత్త, గంగమ్మ పెద్దమ్మ తోడు సగం బలం ఏమైనా బీద బతుకులకు ఎన్నెన్ని ఆటుపోట్లో! భరించక తప్పదు అనుకుంటూ లైటార్పి కునుకుతీసింది.

''గంగమ్మా! శకుంతల రాలేదేం?'' తెల్లారి పనిలోకి దిగిన సెకండ్లలో అడిగాడు సురేంద్ర.

''చాలా వాటితో పోల్చుకుంటే ఇది లంకలా చిన్నసెడ్డే గదా బాబూ! సాకేత నగర్‌లోని సాల్వెంటు ఫ్యాక్టరీలో పని యిప్పించాం'' రావణాసురుని చెరనుంచి సీతాదేవిని విడిపించి అయోధ్యకు చేర్చామన్నంత సంబరంతో గంగమ్మ, సరస్వతమ్మ చెరోమాట అన్నారు.

సురేంద్రకు రవ్వ ఆశ్చర్యం కలగలేదు. నింపాదిగా విన్నాడు. గంగమ్మ, సరస్వతమ్మల కోపం అర్థంగాకపోలేదు. రామాయణమూ గుర్తుకురాక పోలేదు. తను రావణాసురుడు అవునో కాదు గాని శకుంతల సీతే. వీళ్లకు శీలం ముఖ్యం. అది దోపిడీ కాకూడదు. సెడ్డుకు ఉత్తరాన పనిచేస్తున్న శకుంతలను గంగమ్మ, సరస్వతమ్మలకు మల్లె మనసారా దీవించాడు.

''శ్రేయోభిలాషులంటే అచ్చం మీరే గంగమ్మా'' బండి పక్కదారి పట్టిందను సంతోషంతో లేచాడు సురేంద్ర. ఆ పొగడ్తలోని ఆంతర్యం అక్కడున్న ఏ ఆడామగకు బొత్తిగా అర్థమే కాలేదు.

★